

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ పాలకురాలు డి.శివకుమార్ అన్నారు. కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ లక్ష్మి నీతి కథలు, జనరల్ నాలెడ్జ్ చెప్పడం, క్రాఫ్ట్ నేర్పించారని శివకుమారి తెలిపారు. ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు ప్రవేశపెట్టిందని వీటిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సమస్యల పరిష్కారం కోసమే జగనన్నకు చెబుదాం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కారం చూపాలన్న లక్ష్యంతోనే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం రూపొందించారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. మంగళవారం సిఎం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వెబ్సైట్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ స్థానిక కలెక్టరేట్ నుంచి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల ఫిర్యాదు లన్నింటినీ కేంద్రీకృత పద్ధతిలో సేకరించి, వాటిని మిషన్ మోడ్‌లో పరిష్కరించడానికి ప్రభుత్వం ఇకపై చొరవ చూపనున్నదని తెలిపారు. సంక్షేమ పథకాలు అందుకోవడంలో రేషన్ కార్డు వంటివి పొందడంలో ప్రభుత్వ సేవలకు సంబంధించి రెవెన్యూ రికార్డులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 1902 టోల్-ఫ్రీ నంబర్‌ని ఉపయోగించి, కాల్ చేసి ప్రతినిధితో సమస్యను చెప్పాలని ఫిర్యాదును నమోదు చేసుకోవాలన్నారు. యువర్ సర్వీస్ రిక్వెస్ట్ యూనిక్ ఐడిని కేటాయిస్తారని దీని ద్వారా ఎప్పటికప్పుడు అర్జీ పరిష్కార స్థితిగతుల గురించి ఐవిఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా అర్జీదారులకు అప్డేట్ అందుతుందన్నారు. సమస్య పరిష్కారం తర్వాత ప్రభుత్వ సేవల పట్ల అర్జీదారుడు అభిప్రాయాన్ని తెలపాలన్నారు. అనేక సమస్యలకు పరిష్కార ప్రక్రియకు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లో పాటు ప్రత్యక్షంగా సిఎం కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. స్పందనకు మెరుగైన ప్రత్యామ్నాయ కార్యక్రమం జగనన్న కు చెబుదాం అని అన్నారు. వ్యక్తిగత ఫిర్యాదులను సాధ్యమైనంత ఉత్త మమైన రీతిలో పరిష్కరించే హెల్ప్ లైన్ గురించి అవగాహన పెంపొందించాలన్నారు. పరిష్కారాలను క్రమం తప్పకుండా అనుసరించడానికి పర్యవేక్షించడానికి ప్రభు త్వం వివిధ స్థాయిలలో ప్రత్యేక పర్యవేక్షణ బందాలు ఏర్పాటు చేసిందన్నారు. మిగిలిన కార్యక్రమాల కన్నా జగనన్నకు చెబుదాం కార్యక్రమం భిన్నంగా ఉండి అన్ని శాఖలకు చెందిన సమస్యలను, జెకెసి ద్వారా పరిష్కారానికి ఆస్కారం ఏర్పడు తుందన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠను సమర్థతను పెంచే దిశగా యం త్రాంగం పనిచేయాలన్నారు. ఎటు వంటి వ్యయ ప్రయాసలకు ఆ స్కారం లేకుండా ఇంటి వద్ద నుండి 24/7 టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుం దన్నారు. అర్హత ఉండి పథకాలు లబ్ధి రాని పరిస్థితుల్లో, ఎంత ప్రయత్నించినా సత్ఫలితాలు రాని పక్షంలో జెకెసిని ఆశ్రయించాలని ఆయన సూచిం చారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ సేవలులో మరింతగా పారదర్శకత పెంపొందేందుకు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంద న్నారు. సమస్యలు పరిష్కారం ద్వారా అర్జీదారుని ముఖంలో చిరునవ్వులు చిందించే స్థాయిలో యంత్రాంగం పని చేయాలన్నారు మండల స్థాయి నుంచి సిఎం కార్యాలయం వరకు పూర్తి మెకానిజంతో ఈ వ్యవస్థ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయేల్, పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, జిల్లా జెసి ధ్యానచంద్ర హెచ్ఎం, జిల్లా ఎస్పి ఎస్-ఎస్.శ్రీధర్ అదనపు ఎస్పి కె.లతా మాధురి, హితకారిణి సమాజం అధ్యక్షురాలు కాశీ బాల మునికుమారి, రాష్ట్ర దళ్యకళల అకాడమీ ఛైర్మన్ కె.సత్య శైలజ, పురపాలక సంఘ అధ్యక్షురాలు రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ ఖాదర్, ఎంపిపి కె. భాగ్యలక్ష్మి, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తదిత రులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎంఎల్ఎ, ఎంఎల్‌సి తదితరులు

జగనన్నకు చెబుదాం విప్లవాత్మక కార్యక్రమం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన,నాణ్యమైన పరిష్కారం అందించేందుకు చేపట్టిన జగనన్నకు చెబుదాం విప్లవాత్మక కార్యక్రమం అని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సిఎం జగన్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా విలసవిల్లి సచివాలయంలో సర్పంచ్ ఊర్మిళాదేవి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విలసవిల్లి సర్పంచ్ ఊర్మిళాదేవి, గ్రామస్తులు

రుడా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి-రావులపాలెం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలపెమెంట్ అథారిటీ(రుడా) నిధులతో కొత్తపేట నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేబడుతున్నట్లు ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళ వారం రుడా ఛైర్మన్ షర్మిలారెడ్డితో కలిసి రావులపాలెంలో పలు చోట్ల పర్యటించారు ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. నియోజకవర్గంలోని ఆత్రేయ పురం, రావులపాలెం, గోపాలపురం, నర్సిపూడి, కొమరాజులంక గ్రామాల్లోని చెరువులను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి సుందరీకరించడం జరుగుతుందన్నారు. వాడపల్లి కొత్త వంతెన వద్ద నుంచి వెళ్లే రహదారిలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా రోడ్లు నిర్మించామని, ప్రతీ గ్రామంలో పాలన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామ సచివాలయం భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. వివిధ కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ఆత్రేయపురం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు మంగళవారం రుడా ఛైర్మన్ షర్మిలా రెడ్డి తో మండల కేంద్రం ఆత్రేయపురంలో చెరువును అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు నియోజకవర్గంలోని చెరువులను రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.




చెరువు పరిశీలిస్తున్న షర్మిలారెడ్డి, ఎంఎల్ఎ చిర్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-అమలాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధి ఏ మేరకు చేకూరింది లబ్ధిదారులను అడిగి తెలుసు కున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని అవి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చేరుతు న్నది లేనిది పరిశీలించేందుకు గడప..గడపకు మన ప్రభుత్వం పేరిట కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందని రాష్ట్ర ప్రభుత్వం గడప..గడపకూ ప్రభుత్వం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి క్షేత్రస్థాయి సమస్యలను పథకాల లబ్ధిని గూర్చి తెలుసుకొని, వివిధ కారణాల మూలంగా పథకాల లబ్ధి చేకూరని వారికి మరలా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆరు మాసాలలో మరలా లబ్ధిని చేకూర్చుతారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల, మండల స్థాయి ప్రజాప్ర తినిధులు తదితరులు పాల్గొన్నారు.



గడప..గడపకూ.. కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి హాని

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్లాస్టిక్ కవర్లు వాడకంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని మాచవరం సర్పంచ్ నాగావత్తుల శాంతకుమారి సుబ్బారావు అన్నారు. అంబాజీపేటలో మాచవరం పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు వివరించి పర్యావరణ పరిరక్షణ కు ప్లాస్టిక్ కవర్ల నిషేధించి సహకరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపిపి సూదాబత్తుల లక్ష్మీ భార్గవి, ఎంపిటిసి సభ్యురాలు మట్టా పార్వతి, ఉప సర్పంచ్ సుంకర పేరయ్య నాయుడు, పంచాయతీ కార్యదర్శి కుమార్, పాలక వర్గ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిర్మూలనపై అంబాజీపేటలో జరిగిన ర్యాలీలో సర్పంచ్ తదితరులు

మణిపూర్ నుంచి మండపేట చేరిన విద్యార్థి

ప్రజాశక్తి-మండపేట

మణిపూర్ లో ఎన్ఐటి విశ్వ విద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న మండపేట విద్యార్థి సోమవారం రాత్రి సురక్షితంగా ఇంటికి చేరుకున్నాడు. స్థానిక 14 వ వార్డుకు చెందిన బొక్కా మణికంఠ మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్ లో ఎన్ఐటిలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కొద్ది రోజుల నుంచి అక్కడ జరుగుతున్న అల్లర్లు నేపథ్యంలో అతను రాష్ట్రాన్ని చేరుకున్నాడు. మణికంఠ మాట్లాడుతూ కొద్ది రోజుల పాటు ఆహారం, నీళ్లు లేక ఇబ్బంది పడ్డామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి హైదరాబాద్ చేర్చి అక్కడ నుంచి బస్సుల ద్వారా ఇళ్లకు చేర్చారన్నారు. తల్లిదండ్రులు బొక్కా సురేష్ బాబు, దుర్గాదేవి సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బి.మణికంఠ

సచివాలయ వ్యవస్థతో పాలన సులభతరం

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో పాలన సులభతరమైనదని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెముడులంక గ్రామ పరిధిలో సచివాలయాల 2 నిర్మించారు. మంగళవారం నుంచి రెండు భవనాల్లో సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చారు. దీంతో ఇప్పటివరకు ఒకే చోట నుంచి గ్రామానికి సేవలు అందించిన సిబ్బందిని వేరు చేసి సచివాలయం 2 ద్వారా కూడా సేవలను అందిస్తారని ఆయన తెలిపారు. అలాగే ఆధార్ సెంటర్ కూడా సచివాలయం 2 పరిధిలోకి వచ్చిందన్నారు.

కాలువ రేవుల పరిశుభ్రతకు చర్యలు

ఆలమూరు జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా కాలువ రేవుల శుభ్రతకు చర్యలు చేపట్టామని వైసిపి మండల కన్వీనర్ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అన్నారు. చెముడులంక పరిధిలో ప్రధాన కాలువ రేవుల వద్ద శుభ్రం చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఉపాధి పనులు చేసే కూలీలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే వడదెబ్బకు లోనవ్వకుండా ఎప్పటికప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు తాగునీరు, ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరికి ఉపయోగకరమైన రేవులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, మోటూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్సంబంధాలతో మెరుగైన సేవలు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయక్

ప్రజాశక్తి-రామచంద్రపురం

బార్ అండ్ బెంచ్ సత్సంబంధాలతో మెరుగైన సేవలు అందించాలని రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయక్ అన్నారు. రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నాగేశ్వరరావు నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహనవెంకటరమణ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ నిత్య విద్యార్థిలా ప్రాక్టీసు చేస్తూ అభివృద్ధి చెందాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె..మాధవిదేవి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల వద్ద ప్రాక్టీస్ లో మెలకువలు తెలుసుకోవాలన్నారు. తద్వారా మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ భవనానికి మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది శ్రీనివాస సుబ్రహ్మణ్యం బహూకరించిన ఇన్వర్టర్‌ను జడ్జి కె.మాధవిదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, డిఎస్ఎస్ శర్మ, మహిళాన్యాయవాదుల ప్రతినిధి కెవి.సత్యవాణి, పిల్ల పద్వీరామయ్య సహాయ కార్యదర్శి చిన్నం వీర్రెడ్డి, ట్రెజరర్ జెఎస్ఎస్ చక్రవర్తి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు నాయక్‌కు మొక్క అందజేస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

ధాన్యం కొనుగోలుకుచర్యలు చేపట్టామని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీ 2022-23 సీజన్ లో అంచనా వేసిన వరి సేకరణ 2.80 లక్షల మెట్రిక్ టన్నులు అని తెలిపారు. మంగళవారం నాటికి 7824 మంది రైతుల నుంచి 60506.440 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లను జనరేట్ చేశామని తెలిపారు. ఆన్‌లైన్ లో 3159.880 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆఫ్ లైన్‌లో 3767.985 మెట్రిక్ టన్నుల ధాన్యం మొత్తం 8628 రైతుల నుంచి 67301.425 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇందుకు గాను ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజులలోపే 2020 ఎఫ్‌టిఒలకు గాను రూ.23.02 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేశారని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు కొరకు జిల్లా కార్యాలయం 8309432487 వద్ద కంట్రోల్ రూమ్‌ను ఉదయం 8.00 నుండి రాత్రి 8.00 గంటల వరకు సంప్రదించవచ్చని తెలిపారు.

తడిసిన ధాన్యం పరిశీలన

కపిలేశ్వరపురం అంగరలో జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అకాల వర్షాలకు నేలనంటిన వరిచేలు, పాడైన వరి పనలు రంగు మారిన మొలకెత్తిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఆర్‌బికెల ద్వారా రైస్ మిల్లులకు సరఫరా చేస్తున్న ధాన్యం తరలింపు వివరాలను అధికారులను, రైతులను, ఆయన అడిగి తెలుసుకున్నారు. కొన్న ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రికార్డుల్లో నమోదు చేయాలని, రైతులకు సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపు పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహశీల్దార్ కె.సూర్యా రావు, ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి, ఎఒ రమేష్ కుమార్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు, ఉన్నారు



యంత్రంతో వరి కోత కోస్తున్న దృశ్యం

వరి కోతలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. అయితే గత రెండు రోజుల నుంచి వాతావరణం అనుకూలించడం ఎండ కాస్తున్న నేపథ్యంలో రెండు రోజుల నుంచి రైతులు వరి కోతలు పున:ప్రారంభించారు. మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ రబీ సీజన్ కు సంబంధించి 16587 ఎకరాల్లో వరిని పండిస్తుండగా ఇప్పటివరకు 45 శాతం కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పంటను కోయడం, ధాన్యం ఉబ్బిడి చేయడం తదితర పనుల్లో రైతన్నలు బిజీగా గడుపుతున్నారు.

నేడు అవిడిలో పర్యటించనున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-కొత్తపేట

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 10వ తేదీ బుధవారం కొత్తపేట మండలంలోని అవిడి గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకుంటా రని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటరలో తెలిపారు. పవన్ కళ్యాణ్ పర్యటన కోసం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.


వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఉపాధి పనులు చేసే కూలీలు వేసవిలో సరైన జాగ్రత్తలు పాటించాలని ఎంపిపి అంబటి భవాని సూచించారు. మంగళవారం ఆమె ఉట్రిమిల్లి, తాళ్ళపొలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించారు. వేసవి ఉష్ణోగ్రత అధికంగా ఉండటం వల్ల ఉదయం త్వరగా పనులు ముగించుకోవాలని, అదేవిధంగా తప్పనిసరిగా మంచినీళ్ల కూడా తీసుకువెళ్లాలన్నారు. ఎండలు మరీ అధికంగా ఉన్న సమయంలో నీడ ఉన్న ప్రాంతాల్లో సేద తీరాలని అవసరమైతే ఒఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. కూలీలతో మాట్లాడిన అనంతరం వారు చేస్తున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవానీతో పాటు ఎపిఒ అరుణ కుమారి, సర్పంచ్ కట్టా గోవిందు, వైస్ సర్పంచ్ శివ, ఎంపిటిసి సభ్యులు పంపన ఏడుకొండలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిపి భవాని



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కన్యాకుమారి

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని, వైద్య సలహాలు పాటించాలని మండపేట గైనకాలజిస్ట్ డాక్టర్ కన్యాకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగర పిహెచ్‌సిలో వైద్యాధికారులు రత్నకుమారి, ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్ కన్యాకుమారి 37 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హైరిస్క్ గా 9 మంది గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు చేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవలసిన పౌష్టికాహారం, ఆసుపత్రిలోప్రసవాల ప్రాముఖ్యత, ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. అంగరకు చెందిన రాగం రామచంద్రరావు వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్ హెచ్‌పి కె.రమా దేవి, స్టాఫ్ నర్స్ జి నవ్య, లాబ్ టెక్నీషియన్ ఆలీ, ఎఎన్ఎం లు, అంగనవాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్

టిడిపి ఆధ్వర్యంలో ర్యాలీలు, వినతి పత్రాల అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇటీవ ల కురిసిన అకాల వర్షాలకు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు డిమాండ్‌చేశారు. మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

మండపేట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు ఎంఎల్ఎ వేగుళ్ల, టిడిపి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. **అయినవిల్లి** మండలంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుడుపూడి దుర్గారావు ఆధ్వర్యంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ముక్తేశ్వరం కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తదనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరావు, విభిన్న ప్రతిబావంతుల కార్యదర్శి కళ్లేపల్లి సుబ్బరాజు, ఎంబిసి కన్వీనర్ పెంద్ర రమేష్, సర్పంచుల సమాఖ్య ఉపాధ్యక్షులు కాకర శ్రీనివాస్, పార్లమెంట్ మెయిన్ కమిటీ కోశాధికారి సయ్యపురాజు వెంకట సత్యనారాయణ రాజు, ఎస్ సి సెల్ ఉపాధ్యక్షులు మందపాటి కిరణ్ కుమాం తదితరులు పాల్గొన్నారు. **రావులపాలె** తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రావులపాలెం తహశీల్దార్ కార్యాలయంలో ఆపార్టీ నాయకులతో కలిసి తహశీల్దార్ మృత్యుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు,జక్కంపూడి వెంకటస్వామి, కేతా శ్రీను, మాసాబత్తుల ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** అకాల వర్షాలకు రైతులు పూర్తి దెబ్బతిన్నారని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మామిడికుదురు లో మండల పార్టీ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. గొల్లపల్లి మాట్లాడుతూ నష్టపోయిన వరి, ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, పిడుగు పాటుకు గురై మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారాన్ని అందజేయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈలి శ్రీనివాస్, చెల్లింగి సత్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, కాండ్రేగుల భవానీ లావణ్య, బందెల పద్మ, మట్టపర్తి లక్ష్మి, బోనం బాబు, మద్దాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ మండల టిడిపి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఐ.పీ.శెట్టికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, రాష్ట్ర తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు, ఎఎంసి మాజీ ఛైర్మన్ పువ్వల చిట్టిబాబు తదితరులు డిమాండ్ చేశారు. స్తానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం మండల టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం డిమాండ్ల కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ బాలాజీకి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు నామాల బొజ్జియ్య, పితాని రామచంద్ర రావు, దొమ్మేటి వీర్రాజు, గొల్లపెల్లి శ్రీను తదితరులు, పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వం కొనాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి వెంకట లక్ష్మి నారాయణ, అమలాపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గొలకోటి చిన్న, పెయ్యల దుర్గరావు, ఆకేటి పెద్ద,గుత్తుల నాగేశ్వరావు, చిక్కం జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.




మామిడికుదురులో తహశీల్దార్‌కుకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి శ్రేణులు



మండపేలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

కార్టూన్ 'నిజం'



మీరే విషయాన్ని అసంతృప్తులతోనే... చెబితే ఎలా సార్..!!!

నేరాలు ఘోరాలు

ఆక్రమణ తొలగింపు నిరసిస్తూ

మరో యువకుని ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మాస్టర్ డ్రైన్ నిర్మాణ నిమిత్తం అధికారులు ఆక్రమణలు తొలగింపును శ్రీకారం చుట్టారు. ఆక్రమణల తొలగింపు వలన తమ దుకాణాలు పోతున్నాయని గత నెల 5న శిడగం శ్రీనివాసరావు అనే వ్యక్తి సెల్ టవర్ ఎక్కి 6 గంటల పాటు హల్చల్ చేశాడు. ఈ నేపథ్యంలో అధికారులు మరల సోమవారం బాలాజీ చౌక్ సెంటర్లో దుకాణాలు తొలగించవలసిందిగా యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో స్థానిక బాలాజీచౌక్ కార్నర్లో గల దుకాణం యజమాని దత్తి శ్రీ నూకరాజు అనే యువకుడు మంగళవారం విష పదార్థం సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రతిపాడు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ సందర్భంగా యువకుడు విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో అనేక ఆరోపణలు చేశాడు. బాధితుడు నగర పంచాయతీ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. రాజకీయ నాయకులు తమ బంధువుల వద్ద బాధితుడు నగర పంచాయతీ అధికారుల ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడని, అతని ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరించారని ఆరోపించారు. ఒకవైపు దుకాణాలు పోయి, మరోవైపు ఉద్యోగం కూడా పోతే తన కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలని ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. ఆక్రమణ తొలగింపును నిలుపుదల చేయాలని బాధితుడు కోరాడు. ప్రస్తుతం యువకుడు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సి ఉంది.

గోదావరిలో దూకి యువకుని ఆత్మహత్యాయత్నం

- కాపాడిన మత్స్యకారులు

ప్రజాశక్తి - యానాం

యానాం ఎదుర్లంక బాలయోగి వారధి నుంచి గోదావరిలో దూకి సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకుంటుండగా చూసిన స్థానిక మత్స్యకారులు, పోలీసులు అతనిని రక్షించారు. విజయవాడకు చెందిన ఇంజినీరింగ్ చదివిన ఇందుకుర్తి శ్రీకాంత్ కుటుంబసమస్యలు, ఆర్థికపరమైన సమస్యలతో కలతచెంది బాలయోగి వారధి రెండవ పిల్లర్ భాగం నుంచి గోదావరిలో దూకారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న రాజీవ్బీచ్ ప్రాంతంలో బోట్లు రిపేరు చేసుకుంటున్న పెమ్మాడి భైరవస్వామి మరో ఇద్దరు కలిసి ఈదుకుంటూ వెళ్లి ఇందుకుర్తి శ్రీకాంత్ను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. స్థానిక టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది, బీట్ పోలీసు సిబ్బంది వచ్చి అపస్మారకస్థితిలో ఉన్న శ్రీకాంత్కు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం తన కుటుంబానికి సంబంధించిన వివరాలను తెలిపారు. అక్కడ నుంచి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడ జిజిహెచ్కు తరలించారు. శ్రీకాంత్ ఆరోగ్యపరిస్థితి మెరుగైందని ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఇందుకూరి శ్రీకాంత్ పై ఈ నెల 8న అదృశ్యం కేసు నమోదయిందని ఎస్ఐ శేరు నూక రాజు తెలిపారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని క్రాప గ్రామంలో 900 గ్రాముల గంజాయిని ముగ్గురు యువకులు విక్రయిస్తుండగా పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇవి.. అయినవిల్లి మండలం క్రాప గ్రామ శ్మశానవాటిక వద్ద గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడిచేసి తునికి చెందిన కర్రి సత్తిబాబు, కాకినాడకు చెందిన జగన్నాధం రాజేష్, ఫ్రెంచ్ యానాంకు చెందిన బల్ల వెంకట శివశంకర్ ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 900 గ్రాముల గంజాయితో పాటు మూడు సెల్ఫోన్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్యపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం చిన్న పేటలో ఒక మహిళ హత్య గురైన సంఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నక్క మహాలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. ఆమె కుమారుని వద్ద ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం ఆమె కుమారుడు గదిలో నిద్రిస్తున్నాడు. తల్లి మహాలక్ష్మి బయటికి వెళ్లిందని అనుకున్నాడు. కానీ పక్క గదిలో తల్లి విగత జీవిగా మంచంపై పడి ఉండడం చూశాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ రవికుమార్, ఎస్ఐ సిహెచ్.సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహాలక్ష్మి హత్యకు గురైనట్లుగా నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యకేసు నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - పెదపూడి

నడిపల్లికోటకు చెందిన కొడమంచి సురేంద్ర(25) హత్య కేసులో ప్రధాన నిందితుడు లక్కవరపు పవన్కళ్యాణ్ ను పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచారని సిఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పవన్కళ్యాణ్ సురేంద్ర కొత్త మొబైల్ ఫోను ఇప్పించాడు. రెండు వాయిదాలు పవన్కళ్యాణ్ సక్రమంగానే కట్టాడు. అనంతరం వాయిదాలు కట్టడం మానేశాడు. దీంతో వాయిదాలు కట్టాలని అడిగినందుకు సురేంద్ర వెళ్లాడు. ఆగ్రహానికి గురైన పవన్కళ్యాణ్ ఇనుప గొట్టంతో సురేంద్రను కొట్టి చంపేశాడు. ఇంట్లోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అరెస్టు చేసి ఈనెల 15 వరకు రిమాండ్ విధించారు.

విరిగిన స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బైక్ అతి వేగంగా నడుపుతూ విరిగిన కరెంట్ స్తంభాన్ని ఢీ కొని యువకుడు మృతి చెందిన సంఘటన వాడపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇవి.. గ్రామానికి చెందిన పోలిమాటి మహేష్ కుమార్ మంగళవారం బైక్ అతి వేగంగా నడుపుతూ రోడ్డు పక్కన గ్రామస్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసుకున్న విరిగిన కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని కుటుంబ సభ్యులు 108 లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ కేసు తెలిపారు.

యానాం వార్తలు


కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్

ఇద్దరు కార్మికులను బంధించి చిత్రహింసలు

- యాజమాన్యంపై చర్యలు కోరుతూ సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పని నచ్చక వెళ్లిపోతున్న ఇద్దరు కార్మికులను యాజమాన్యం బంధించి, చిత్రహింసలకు గురిచేసిన సంఘటన యానాంలో వెలుగుచూసింది. స్థానిక సీతారామనగర్ అడవిపాలెంలో ఉన్న సిటిజన్ హెల్త్ కేర్ లిమిటెడ్ లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన మురుగు, మరో వ్యక్తిని సెక్యూరిటీ గదిలో భోజనం కూడా పెట్టకుండా పది రోజులపాటు బంధించి చిత్రహింసలు ఒక గురి చేసినట్లు బాధితుడు మురుగు, స్థానికులు తెలిపారు. బాధితులకు పది రోజులపాటు స్థానికుడు చిల్లా శ్రీను అనే వ్యక్తి భోజనం పెట్టినట్లు తెలి పాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరు బాధితులు తప్పించు కోవడానికి ప్రయత్నించగా మురుగు అనే వ్యక్తిపై సెక్యూరిటీ సత్యనారాయణ, క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సయ్యద్ అహ్మద్లు దాడి చేస్తున్న సమయంలో స్థానికులు అడ్డుకుని మురుగుని కాపాడారు. మరో వ్యక్తి ఎక్కడికి వెళ్లిపోయాడో తెలియదని తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను, కార్మికులను అండగా నిలిచారు. బాధితులను చిత్ర హింసలకు గురిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ కార్మికులకు అండగా సిఐటియు పోరాడుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెల్లం చిన్న, సబ్బతి శ్రీనివాసరావు, మెల్లం నూకాంబరం, కామిరెడ్డి వీరబాబు, యనమదల పెద్దిరాజు, మోర్తా యేసు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్లు 24 గంటలు పని చేయాలి

యానాం ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకుల డీలర్లతో ఆర్ఎఒ మునిస్వామి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. బంకులు 24 గంటలు పని చేయాలని, ప్రతి బంకులో పబ్లిక్ టాయిలెట్లు ఉండాలని సూచించారు. 2వేల500 లీటర్ల కంటే ఎక్కువ రవాణా చేసినట్లయితే పౌరసరఫరాల శాఖ నుండి అనుమతి పొందాలని ఆర్ఎఒ వివరించారు. ముందుగా ద్విచక్ర వాహనాదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

మెట్టకూరులో ఆర్ఎఒ పర్యటన

మెట్టకూరు రాజబాబు కాలనీలో రోడ్లు,డ్రైన్లు లేక వర్షపు నీరు నిల్వ ఉండిపోతుందని దాని ద్వారా దోమలి పెరిగి వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ కలిసి గ్రామాన్ని సందర్శిం చారు.

11న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

యానాంలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి, ఫిర్యాదుల స్వీకరణకు గురువారం పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఎఇ లంక కృష్ణారావు తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. పుదుచ్చేరి విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు సెంథిల్ కుమార్ పర్యవేక్షణలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


బాధితునితో వైద్యులు

తుని ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - తుని

తుని ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అరుదైన శస్త్రయికిత్స చేసి రెండు కేజీల కణితిని తొలగించారు. తొండంగి మండలం గురువారం కొత్తపేట గ్రామానికి చెందిన 50 ఏళ్ల .మాసేను ఎడమ కాలు వద్ద కణితితో ఇబ్బంది పడుతూ సోమవారం తుని ఏరియా ఆసుపత్రికి రాగా పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సాయికిరణ్, నరేష్, శ్రావణి బందం సుమారు మూడు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి రెండు కేజీల కణితిని బయటకు తీశారు. ఈ సందర్భంగా తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పోతల లక్ష్మణ్, చిక్కాల లక్ష్మణ్ సూపరింటెండెట్ స్వప్న,, వైద్యులను అభినందించారు.

షార్ట్ సర్క్యూట్తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - తుని

కోటనందూరులో మంగళవారం షార్ట్ సర్క్యూట్ వల్ల తాటాకిల్లు దగ్ధమైంది. దళిత కాలనీకి చెందిన నందికి విజయరాజు తాటాకు ఇంట్లో నివాసం ఉంటుం డగా కరెంటు వైరు తాటాకు ఇంటికి తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి సుమారు నాలుగు లక్షల విలువైన సామగ్రి కాలిపోయిందని వారు తెలిపారు. సర్పంచ్ గరిసింగి శివలక్ష్మి, వైసిపి నాయకులు దొర బాబు, రాము, శ్రీనివాస్, శ్రీను వారిని పరామర్శించారు.

తడిసిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గంలో తెలుగు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులను కలిసి కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం వడ్లమూరులో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఎలిశెట్టి నాని మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఉపేంద్ర, బోసు, కందుల విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంజర్లో గడప గడపకూ..

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ఇంజరం పంచాయతీలో సర్పంచ్ ముద్దన వెంకట శివ రాంప్రసాద్ ఆధ్వర్యంలో అరటి కాయలంక, బుడితివారి పేటలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చింతలపాటి శ్రీనివాసరాజు, ఎంపిపి రాయుడు సునీత , జడ్పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివ నారాయణ, సర్పంచ్ ముద్దన ప్రసాద్, పాల్గొన్నారు.

ముగిసిన యూత్ ఐ.కాన్ స్పోర్ట్స్-2023

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు యూత్ ఐ.కాన్-2023 పేరిట నిర్వహించిన వివిధ రకాల క్రీడలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు కళాశాల ప్రిన్సి పాల్ ఆదిరెడ్డి రమేష్ ట్రోఫీ, మెడల్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎన్.రవి,. డీన్ పి.ఎస్.వి.వి.ఎస్ రవి కుమార్, ఎఒ టి.ఎన్.వి.ఎస్. రామచంద్రన్, క్రీడాకా రులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతూ సుధారాణి బాలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తుని

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని పట్టణ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఏలూరు సుధారాణి బాలు అన్నారు. మంగళవారం మన మున్సిపాలిటీ - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 22వ వార్డులో పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయో లేదో అని నేరుగా వారితో ముఖాముఖిగా మాట్లాడి ప్రభుత్వం యొక్క పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం సుధారాణి బాలు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో తుని పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ పామర్తి మహేష్, అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు జీవరత్నం, కోలా శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంతో సమగ్రంగా సర్వే చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు,సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.


రోడ్డు మధ్యలో గోతిని పూడ్చిస్తున్న యువత

డ్రైయినేజీ నిర్మాణానికి తవ్విన గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి - గండేపల్లి

ఇటీవల గండేపల్లిలో సింగరంపాలెం వెళ్లే రహదారిలో బీసీ కాలనీకి చెందిన డ్రెయినేజీ వాటర్ ను తరలించేందుకు దళితువాడవైపు డ్రెయినేజీ నిర్మాణానికి గోతులు తీస్తుండగా దళితవాసులు ఆందోళన చేపట్టారు. దానివల్ల ట్రాఫిక్ సమస్య నెలకొంది. జనతా గ్యారేజ్ యువకులు విప్పర్ల సురేష్, దారా కాటయ్య, వెంపాటి సతీష్, పసుమర్తి సుబ్ర మణ్యం తదితరులు సొంత ఖర్చులతో యధావిధిగా రోడ్డు మధ్యలో తీసిన డ్రెయినేజీ గోతిని పూడ్చి వేయించారు. దీంతో ఆ దారిలో వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా ఉండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు

ఆక్రమణదారులకు మున్సిపాలిటీ నోటీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వెనుక గల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి మున్సిపల్, రెవెన్యూ అధికా రులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల కాలంలో తహశీల్దార్ కాలనీ వెనుక లక్షలాది రూపాయల విలువ జేసే ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల జోక్యంతో ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. దానిపై పలువురు చేసిన ఫిర్యాదులు మేరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు వాటిని ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించు కావాలని లేదంటే తామే తొలగించే చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరిస్తూ కట్టడాలకు అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులకు కొద్ది రోజులు గడువును ఇస్తూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లేని పక్షంలో తామే శాఖపరంగా ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు.

పుస్తక పఠనంతో సామాజిక అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుండి పుస్తకాలు చదవటం వల్ల సామాజిక అవగాహన పెరుగుతుందని హిందీ పండిట్ వాడపల్లి విమలా రాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం రెండవ రోజు మంగళవారం ఆమె కథలు చదవటం, కథలు చెప్పడం,స్పోకెన్ ఇంగ్లీష్ లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు,సిబ్బంది సింగం బుల్లయ్య,మరియమ్మ,పాఠకులు పాల్గొన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలో ని యాస లపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు పూజితా టీచర్ ఉదయం విద్యార్థులకు ఆత్మ రక్షణకు సంబంధించిన అనేక అంశాలపై కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఎంఎస్సి మూర్తి మ్యాథ్స్లో, శ్యామ్ కుమార్ డ్రాయింగ్లో శిక్షణ ఇచ్చారు. ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు జోత్స్న, అమత, సూరజ్లు మ్యాథ్స్లో శిక్షణ ఇచ్చారు.ఎంఎస్సి మూర్తి, అధ్యాపకులు రాజకుమార్, లక్ష్మిలు చాక్లెట్స్,బిస్కెట్స్ అందజేశారు.

ఓటమి విజయానికి తొలి మెట్టు

ప్రజాశక్తి - గండేపల్లి

ఓటమి అంటే తుది మెట్టు కాదని మన కృషి పట్టుదలతో విజయానికి తొలిమెట్టుగా మలుచుకొని ముందుకు సాగాలని వక్తలు విద్యార్థులకు పిలుపు నిచ్చారు. సూరంపాలెంలో ఆదిత్య సెంట్రల్ లైబ్రరీలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ కె. అశోక్ కుమార్, జాయింట్ ట్రెజరర్ తోటకూర గంగాధర్లు విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. టెన్త్, ఇంటర్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ముగిసి పోయింది అనుకోవడం మూర్ఖత్వం అన్నారు. తొందరపాటు చర్యలతో ఆత్మహత్యకు పాల్పడటం మానుకోవాలని, తమను తాము తెలుసుకున్న వారు ఆయా రంగాలలో ప్రావీణ్యం పెంపొందించుకొని పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి అత్యున్నత స్థాయిలో ఉన్నవారు ఎందరో ఉన్నారని వివరించారు.

రైల్వే స్టేషన్లో అన్నవరం దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్లో అన్నవరం ఆలయానికి చెంది సామర్లకోట రైల్వే స్టేషన్లో ఉన్న హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవస్థాన సూపరింటెండెంట్ ప్రసాద్, క్యాషియర్ నాగేశ్వర రావు లు అన్నవరం దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, స్థానిక భీమేశ్వరాలయం ఇఒ డి నాగ మల్లేశ్వరరావుల సమక్షంలో మొదటి ప్లాట్ ఫామ్పై గల హుండీని తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ. 36,767లు ఆదాయం వచ్చినట్టు భీమేశ్వర స్వామి ఆలయ ఇఒ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

టెన్త్ విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - మండపేట


విద్యార్థి వినయ్ను సత్కరిస్తున్న మల్లిబాబు

మండలంలోని తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు శ్రీమతి భూషణం జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వినయ్ ను సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వినయ్ 584 మార్కులు సాధించడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మల్లిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - మామిడికుదురు


పాశర్లపూడిలంక లో ఉపాధ్యాయులకు సన్మానం

పాశర్లపూడి లంక బొరుసు తిరుపతయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టెన్త్ ద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా హెచ్ఎం ఎన్విఎస్ఎస్.దుర్గాప్రసాద్, సహోపాధ్యాయులు కెవి.విజయ లక్ష్మిలను సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు, సానికులు మంగళవారం శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొరుసు గోపాల కృష్ణ, పితాని వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పివి.రావు జయంతి

ప్రజాశక్తి-అమలాపురం


హరి మనోవికాస కేంద్రంలో కేక్కట్ చేస్తున్న దృశ్యం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం స్థానిక కొంకాపల్లి హరి మనోవికాస కేంద్రం మంగళవారం పివి.రావు జయంతిని ఆయన అభిమా నులు ఘనంగా నిర్వహిం చారు. తొలుత అంబేద్కర్ పివి.రావు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికలాంగులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో పివి.రావు సోదరుడు పోతుల నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పెయ్యల పరశురాం, జాతీయ కార్యదర్శి జల్లి శ్రీనివాస రావు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ బ్లడ్ డొనేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బూల విజయబాబు, దళిత సేన అధ్యక్షుడు డేవిడ్ అంబేద్కర్, జల్లి శేఖర్, పోతుల నాగర్జున, మాదే విజయకుమార్,పినిపే సతీష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తాళ్లపూడి


పట్టుబడ్డ బియ్యంతో పోలీసులు అధికారులు

తెలంగాణ నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తాళ్లపూడి అధికారులు మంగళవారం పట్టుకున్నారు. తాళ్లపూడి ఎస్ఐ కెవి.రమణ తెలిపిన వివరాల మేరకు తెలంగాణ నుంచి కాకినాడకు ఒక వ్యాన్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారని తాళ్లపూడి సిఎస్డిటి సునీతకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసుల సహకారంతో వాహన తనిఖీలు చేపట్టారు. బియ్యం తరలిస్తున్న వ్యాన్ను గుర్తించారు. సుమారు రూ.1.80 లక్షల విలువ చేసే ఐదు వేల కేజీల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. వి.కృష్ణంరాజు, కె.గంగాధర్లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా సారా తయారీ, అమ్మకాల నియంత్రణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగాలని జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సారా తయారీ ఉపయోగించే బెల్లం సరఫరా చేసే వారిని కట్టడి చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రవాణా అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టేలా చర్యలు తీసుకోవాల న్నారు. పోలీసులు వత్తినే పన్యాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతిలో కేసుల దర్యాప్తుని వేగంగా పూర్తి చేయాలన్నారు. కోర్టులో విచారణలో ఉన్న కేసులను పురోగతి నిశితంగా పరీక్షించే ముద్దాయిలకు శిక్ష పడేట్లుగా చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్ కుమార్ సింగ్, పి.సునీల్ కుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్ కుమార్, సబ్ అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మం సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఆలమూరు



వీర బ్రహ్మంను సత్కరిస్తున్న ఎస్టియు నాయకులు

విద్యార్థుల భవిష్యత్తు కోసం వీరబ్రహ్మం మాస్టారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్టియు శాఖ మండల శాఖ నాయకులు అన్నారు. స్థానిక బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్థిక సౌజన్యంతో నిర్వహించబడిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయన్ను ఎస్టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వాకరు మాట్లాడుతూ 25 రోజులు పాటు 120 మంది విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ ఇవ్వడమే కాకుండా సుమారు రూ.50 వేల విలువ గల మెటీరియల్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారని వివరించారు.కార్యక్రమంలో వైవి. రామచంద్రం, ఎం.రాజగోపాల్, వంశీకష్ణ, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, గోవిందరాజు, లోకేష్, రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరే క ప్రభుత్వం

ప్రజాశక్తి - అంబాజీపేట


తహశీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎఐసిసి మెంబర్ బిఆర్కె.నాయుడు మాట్లాడుతూ తడిసిన , పొడి ధాన్యాన్ని కలాల్లోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, పిసిసి మెంబెర్స్ ములపర్తి మోహనరావు,మాచవరపు శివన్నారాయణ, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు వడ్డీ నాగేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి, దేవరపల్లి రాజేంద్ర, మహ్మద్ ఇస్మాయిల్, కొల్లి సరోజని, పులిదిండి బాలయోగి, చిట్ల జోగేస్వరరావు, సిపిఐ నాయకులు పితాని ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలో పలు చోట్ల కరెంట్ కష్టాలు మొదలయ్యాయని బిసి సేన నాయకులు యాట్ల నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ తీస్తున్నారని అన్నారు. ద్రాక్షారామ లో రాత్రి 10,12 గంటలకు తెల్లవారు జామున 3,4 గంటల సమయంలో కరెంట్ తీసివేశారని అన్నారు. కరెంట్ పలు మార్లు తీసివేయడంవలనప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారన్నారు. ఇప్పటికైనా సంభందిత అధికారులు స్పందించి రాత్రి సమయంలో కరెంట్ పోకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.